# చీకటి

**-బద్దిగం పాండురంగారెడ్డి**

రఘురాం వెనక్కి కుర్చీలోకి ఒరిగి ఆకాశంలోకి చూస్తూ ఉండిపోయాడు.

మనిషన్నప్పుడు మంచిగా, మనిషిలా బ్రతకాలి.

తను అందుకే ప్రయత్నం చేసాడు. అందుకే పరీక్షల్లో తను కాపీ కొట్టలేదు, సార్లకు మస్కా కొట్టలేదు, కాకా పట్టలేదు.

ఐతే ఏమయింది?

ఒట్టి వెధవలు, చచ్చు చవటలు, మొద్దులు పాసయ్యారు. సుబ్బులు, రాజు, ఎన్నడూ కాలేజీ మొహం కూడా చూడని సన్యాసిరావు అందరూ ఫస్ట్‌క్లాసులో పాసయ్యారు.

మరి తనో? తను తప్పి కుక్కిన పేనులా కూర్చున్నాడు. ఎన్నిసార్లని... ఒకసారా...రెండు సార్లా... నాలుగోసారి తన మంచితనం పాస్ క్లాసులో నెగ్గింది.

అందరూ తనను అమాయకుడన్నారు. కొందరు అసమర్థుడన్నారు.

ఊ...అంటే అన్నారులే చవటలు... వాళ్లకేం తెలుసు మనిషి మంచితనంలో బ్రతుకుతూ పొందే ఆనందం?

తను మాత్రం గాంధీ మహాత్ముడంత మహోన్నతంగా ఎదిగిపోతున్నట్లు అనుభూతి పొందాడు తన మంచితనంపై వున్న విశ్వాసంతో.

తరువాత... తరువాత...

ఉద్యోగం కోసం ఎన్ని తంటాలు పడ్డాడని తను? ఎన్ని ఇంటర్‌వ్యూలకు వెళ్లాడని తను?

మరి తన క్లాస్‌మేట్స్... అందరూ ఎప్పటి నుండో ఉద్యోగాలు చేస్తున్నారు. పైరవీలు చేసి, లంచాలు ఇచ్చి, లంచాలు పుచ్చుకుంటూ ఎంతో డబ్బు కూడా సంపాదించారు. ఛీ...ఛీ... మనిషి నైతికంగా పతనమై పోయిన తరువాత ఎందుకో ఈ డబ్బు?

వాళ్లకెప్పుడు ఎలా బ్రతకాలి? ఎలా సుఖాన్ని పొందాలీ అన్న ఆలోచనేగానీ మనం ఎందుకు బ్రతుకుతున్నాం, ఎవరికోసం బ్రతుకుతున్నాం, ఏ విధంగా బ్రతుకుతున్నాం అన్న ధ్యాసేలేదు... పశువులు...పశువులు.

తనకు మాత్రం ఆలస్యమైనా ఇంత కాలానికి న్యాయంగా, ఆ సూపర్‌వైజర్ ఉద్యోగం వచ్చింది.

పైరవీ చేయకుండా, లంచమివ్వకుండా తను సంపాదించుకున్న ఉద్యోగంపట్ల ఎంత తృప్తి తనలో, ఎంత సంతోషం తనలో. కానీ ఈ పి.డబ్ల్యు.డిలో ఒక్కడూ మనిషిలా కనిపించడం లేదు తనకు. అన్నీ బరువులు, లంచాలు... ఇవే. పై నుండి క్రిందిదాకా అంతా కరప్షన్... బ్రూట్స్...బ్రూట్స్...

అబ్బా... తనకు వాళ్లంటే అసహ్యం.

ఆ రోజు కంట్రాక్టర్ తనకు లంచమియ్యవస్తే వద్దని తిరగ్గొట్టినప్పుడు, సూపర్‌వైజర్లందరూ ఎవరో ఏర్పాటుచేసిన మందు పార్టీకి తనను రమ్మంటే తను తిరస్కరించినప్పుడు... వాళ్లందరూ అదోరకంగా హేళనగా పిచ్చివాడ్ని చూస్తున్నట్లుగా చూచిన చూపులు... తన గుండెలను కాల్చిన ఆ చూపులు ఎంత వికృతంగా ఉన్నాయని!

వాళ్లందరూ తనను అసమర్థుడనుకున్నారా? అనుకోని...

కానీ తనకు తన మంచితనంలో, గౌరవంలో, విశ్వాసంలో ఎంతో తృప్తి వుంది. తనకిది చాలు.

రఘురాం గుండెలనిండా ఊపిరి పీల్చుకుని నిట్టూర్చాడు ఆనందంగా.

అతని మనస్సు పారుతున్న నదిలా ఉంది తేలిగ్గా.

ఎదురుగా నీలాకాశం అతని హృదయంలా వుంది విశాలంగా.

లేచి ఇంట్లోకి వెళ్లబోతూండగా వాకిట్లోకి ఓ జీపు దూసుకొచ్చింది.

అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటాచలం.

"రండి...రండి రాక రాక వచ్చారు. ప్లీజ్ బి సీటెడ్" రఘురాం ఎదురెళ్లి ఎఇగారిని తీసుకొచ్చి కూర్చోబెట్టాడు.

"నీతో కొద్దిగా పనుందోయ్"

"చెప్పండి."

"మరి కాదనకూడదు. ఐనా నేను అడిగిన తరువాత నువ్వు కాదనవనే నమ్మకం నాకుందనుకో."

"మీరే నా ఇమ్మీడియట్ బాస్ కదండీ, మిమ్మల్ని కాదంటే ఎలా?"

"ఔను కదా. ఏమీలేదు. ప్రస్తుతం నువ్వు ఆ రోడ్ కన్‌స్ట్రక్షన్‌లో వుంటున్నావుకదా. ఐతే దాని కంట్రాక్టర్ ఎవరోకాదు, నేనే. కాకుంటే చాలా అర్జంటుగా డబ్బు అక్కరపడింది. రోడ్డు తాలూకు బిల్లు చేసి డ్రా చేసుకుందామంటే పనేమో ఇంకా పూర్తి కాలేదు. అందుకని నువ్వో సహాయం చేయాలి."

"చెప్పండి."

"ఏంలేదు. రోడ్డు ఇంకో కిలోమీటర్ కావాల్సి వుంది. అంతేకదా. ఐతే నువ్వు మొత్తం వనంతా అయిపోయినట్టు కనుక ఇప్పుడు రికార్డు చేస్తే ఎఇగా నేను సంతకం పెట్టి డబ్బు డ్రా చేసుకుంటాను."

"మరీ..."

"నువ్వేం ఆలోచించకు. ఓ వారంరోజుల్లో వనంతా నేను పూర్తి చేయిస్తాను. ఈలోగా ఎవరూ ఇన్‌స్పెక్షన్‌కి రాకుండా ఇఇని నేను చూసుకుంటాను. నువ్వు ఊ అను."

రఘురాం పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా వుంది.

ఎఇ కాగితాల కట్టను, పెన్నును ఎదురుగా పెట్టాడు.

"నువ్వేం భయపడకు నేనున్నానుకదా" అన్నాడు నవ్వుతూ.

"అంతేనంటారా?" ఆబ్లిగేషన్.

ఎస్టిమేటెడ్ బిల్లుమీద సంతకం పెట్టాడు.

మర్నాడు-

రఘురాం ఇంటికి ఓ ఖాకీ బట్టలు ప్యూనొచ్చి ఓ కవరు అందించాడు.

అది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాసింది.

"మిస్టర్ రఘురాం! గివ్ తౌజెంట్ రుపీస్ టు ది బేరర్"

ఇఇగారి వ్రాలు.

ఎక్కడివి? తనెందుకియ్యాలి?

రోడ్డు తాలూకు బిల్లులో ఇఇ మామూలా?

"నేనేమీ డబ్బు ఇవ్వాల్సింది లేదు" అని రాసి

వంపాడు చీటీమీద.

★★★

మర్నాడు-

రఘురాం రోడ్డు పని జరుగుతున్న చోట డ్యూటీలో వున్నాడు. సర్రున జీపొచ్చింది.

జీపులో నుండి ఇఇ, ఎఇ ఇద్దరూ దిగారు.

ఇఇ ముఖం నిప్పులా వుంది నిన్న వెయ్యి రూపాయల కోపంతో.

ఎఇ ముఖం ఎప్పుడూ మామూలుగానే వుంటుంది నవ్వుతూ. అతని సర్వీసు పెద్దది.

"మిస్టర్ రఘురాం. రోడ్డు పని పూర్తయిందని బిల్లులో రికార్డు చేసావుకదా. ఐ వాంట్ టు ఇన్ స్పెక్ట్."

రఘురాం ఎఇగారి ముఖంలోకి చూసాడు ఎలా అన్నట్లుగా.

ఎఇగారు మాట్లాడలేదు. మామూలుగా నవ్వు తున్నాడు.

"మాట్లాడవేం" గద్దింపు.

"రోడ్డింకా పూర్తి కాలేదు సార్."

"మరి కానిది ఐనట్టు ఎందుకు రికార్డు చేసావు?"

"ఇదీ...ఇదీ..."

"నాకు సంజాయిషీ అనవసరం. నిన్ను సస్పెండ్ చేస్తున్నాం."

రఘురాం ఎఇగారి ముఖంలోకి చూసాడు నిస్సహాయంగా.

ఎఇగారు నవ్వుతూనే వున్నాడు సన్నగా, మామూలుగా.

మరో రెండు నిముషాల్లో ఇఇగారి జీపు వెళ్లిపోయింది సర్రున రఘురాం కళ్లనిండా దుమ్ముకొట్టి.

అంతా చీకటి... చీకటి...!

★

